క్లుప్తంగా

'బ్యాంక్ మిత్ర'లను వినియోగించుకోండి

మండవల్లి: బ్యాంకు మిత్ర సేవా కేంద్రాల్లో బ్యాంకు లావాదేవీలు త్వరితగతిన నిర్వహించుకొని వినియోగించుకోవాలని మండవల్లి ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. సోమవారం మండవల్లి బ్యాంక్‌లో ఖాతాదారులు ఉక్కపోతలో పడుతున్న ఇబ్బందులు చూసి ఆయన స్పందించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన బ్యాంకు మిత్ర పాయింట్లపై అవగాహన లేక వినియోగించుకోలేకపోతున్నారన్నారు. బ్యాంకులో జరిగే లావాదేవీలన్నీ బ్యాంకు మిత్ర సేవా పాయింట్ల వద్ద పొందవచ్చని చెప్పారు. ఇంటి వద్ద నుంచే బ్యాంకులో జరిగే సేవలు పొందవచ్చని మేనేజర్ పేర్కొన్నారు.

కొర్లపాడులో కాలువ అభివృద్ధి పనులు



మండవల్లి: మండలంలోని కొర్లపాడు గ్రామంలో కాలువ అభివృద్ధి పనులు ఉపాధి కూలీలు సోమవారం నిర్వహించారు. రూ. లక్షా 20 వేల ఉపాధి హామీ నిధులతో పనులు చేస్తున్నట్టు ఎంటీఏ నవీన్ పేర్కొన్నారు. 62 మంది కూలీలు పనుల్లో పాల్గొంటున్నట్టు చెప్పారు.

విద్యార్థులకు సత్కారం



అడ్డాడ(పామర్రు): పదో తరగతి ఫలితాలలో పాఠశాల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించామని హెచ్ఎం డి. పద్మ అన్నారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం విజేతలైన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలలో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ఎం. చరిష్మా 576 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అదే విధంగా ఇంగ్లిషు మీడియంలో ఎం. జ్యోత్స్న 539 మార్కులు, తెలుగు మీడియంలో జె. ప్రసన్న 400 మార్కులతో ప్రథమస్థానం ఎస్. సంధ్యా 363 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారని అన్నారు. విజేతలైన విద్యార్థులను హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు శాలువాలను కప్పి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్. రంగ ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగ భగలు



తోట్లవల్లూరు: భానుడి భగభగలతో జనం అల్లాడిపోయారు. రోహిణీకార్తె రాక ముందే ఎండలు మండుతుండటంతో ప్రజలు ఎండల వేడిమితో భయాందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా సోమవారం 45 డిగ్రీలకుపైగా ఎండ ఉండటంతో దాదాపుగా జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రధాన రహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి. వడగాడ్పుల తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్లు ప్రారంభం

గుడివాడ టౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐలో అనేక కోర్సులు అందుబాటులో తీసుకొచ్చామని కళాశాల ప్రిన్సిపల్ జి. హరిధర్మేంద్ర తెలిపారు. కళాశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 10వ తేదీన అడ్మిషన్‌లు ప్రారంభించామని జూన్ 6వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ప్రస్తుతం సమాజానికి అవసరమైన ఉత్పత్తుల తయారీ, వ్యక్తిగతంగా చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన శిక్షణలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ శిక్షణలో చేరి ఉద్యోగ అవకాశాలు పొందడంతో పాటు ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 855952320, 8297574757లను సంప్రదించాలని సూచించారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



గుడివాడ టౌన్: సామాజిక సంఘాలు ప్రజాసేవ చేయడం అభినందనీయం అని టూటౌన్ ఎస్ఐ పూడి నాగరాజు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో సోమవారం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండవేడిమి అధికంగా ఉన్న నేపథ్యంలో పలు ప్రాంతాల నుంచి పట్టణానికి బాటసారులు అధిక సంఖ్యలో వస్తారని వారి సంక్షేమం దృష్ట్యా ఈ మంచి కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు.

సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి

జిల్లా అధికారులతో మంత్రి జోగి రమేష్



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, పక్కన కలెక్టర్ రాజాబాబు, జేసీ అపరాజితాసింగ్

పెడన:ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్ అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ హాల్లో నియోజకవర్గంలోని సమస్యలపై కలెక్టర్ రాజబాబుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో ప్రస్తుతం ఎవరైతే అనుభవదారులు ఉన్నారో వారికి పట్టా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణా యూనివర్సిటీకి కేటాయించిన స్థలానికి సంబంధించి నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరారు. తీర ప్రాంతంలో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని, ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్య నెలకొందని మంత్రి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలోని జగనన్న లే అవుట్లలో అంతర్గత రహదారులకు రూ.1.75 కోట్లు సరిపోవని, పెద్ద కాలనీలు కావడం వల్ల క్షేత్రస్థాయిలో పరిశీలించి నిధులు పెంచాలని సూచించారు. ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్ పూర్తిగా అందడం లేదని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విద్యుత్‌ను సరఫరా చేయాల్సిందిగా కోరారు. పలు మండలాల్లో సొంత ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారి కోసం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఆయా సమస్యలను మళ్లీ రెండు నెలలు తర్వాత ఏర్పాటు చేసుకునే సమావేశంలో చర్చకు రాకుండా చూడాలని కోరారు. బాధ్యతగా ఆయా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలను పొందేలా నడుచుకుందామని ఆకాంక్షించారు. కలెక్టర్ రాజబాబు మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా పెడన నియోజకవర్గానికి వచ్చానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఏయే సమస్యలున్నాయో మంత్రి సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. డివిజన్, జిల్లా స్థాయిలో సమస్యలుంటే తన దృష్టికి వెంటనే తీసుకురావాలని చెప్పారు. వాటిని పరిష్కరించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, మచిలీపట్నం ఆర్డీవో కిశోర్, పెడన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు బళ్ల జ్యోత్స్నరాణి, చినబాబు, రత్నకుమారి, వెంకటరమణ, చారుమతిలతో పాటు జిల్లా, డివిజన్, మండల అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మొదటి సారిగా పెడన నియోజకవర్గానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ రాజబాబును మంత్రి జోగి రమేష్ సత్కరించి, పెడన కలంకారి జ్ఞాపికను అందజేశారు. జేసీ అపరాజితాసింగ్‌కు మహిళా ప్రజాప్రతినిధులు చారుమతి, జ్యోత్స్న వెంకటరమణ, రత్నకుమారి సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

కొనసాగుతున్న వేసవి శిబిరాలు



మండవల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు సూచనలిస్తున్న షేక్ పర్వీన



నేర్చుకున్న పద్యాలను చెబుతున్న చిన్నారులు

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో సోమవారం విజ్ఞాన శిబిరం కొనసాగింది. గ్రంథపాలకురాలు షేక్ పర్వీన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పేర్కొన్నారు. విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకొని గ్రంథాల సారాన్ని గ్రహించి లబ్ధి పొందాలని కోరారు. స్టేషన్ మాస్టర్ ఎం.శ్రీనివాస్ రాజీవ్ కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు.

శిక్షణ తరగతులు..

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు సోమవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు పద్యాలు, తాత్పర్యాలు, భావాలు, నీతిని వివరించారు. పద్యరూపంలో అనేక అంశాలను చిన్నారులకు స్పష్టంగా వివరించవచ్చునని ఉపాధ్యాయుడు హేమంత్ అన్నారు. పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొని శిక్షణ పొందుతున్నారని గ్రంథాలయ ఉద్యోగి టి. ప్రవల్లిక తెలిపారు.

ఆర్థర్ కాటన్ ఆదర్శనీయుడు



కలిదిండి గ్రంథాలయంలో ఆర్థర్ కాటన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నారులు

కైకలూరు: అపర భగీరథుడు, గోదావరి డెల్టా పితామహుడు సర్ ఆర్థర్ కాటన్ ప్రజలకు చేసిన సేవను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని కలిదిండి శాఖ గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు అన్నారు. సోమవారం కాటన్ జయంతిని పురస్కరించుకుని గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రమేష్‌బాబు మాట్లాడతూ 1847లో గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద చేపట్టిన ఆనకట్ట నిర్మాణంలో అప్పటి చీఫ్ ఇంజినీర్ కాటన్ చేసిన నిర్విరామ కృషి చేసి 1852 మార్చి 31న నాటికి పూర్తి చేశారన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం 8వ రోజుకు చేరిందని, విద్యార్థులకు ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ సేవలను వివరించామన్నారు. కథలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు డీవీ నరేష్, షేక్ మొహిద్దీన్ నాయక్‌లు పాల్గొన్నారు. కైకలూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయాధికారి ఆర్.రాఘవులు పలు క్రీడలు నేర్పించారు.

సచివాలయంలో రికార్డుల తనిఖీ



పెడన నాలుగో సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో పద్మ

పెడన: సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సచివాలయాల మచిలీపట్నం డీఎల్‌డీవో జి.పద్మ అన్నారు. పట్టణంలోని నాలుగో సచివాలయాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పుస్తకంతో పాటు మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎంత మంది సచివాలయంలో ఉన్నారు, మిగిలిన వారు ఎక్కడెక్కడకు వెళ్లారనే దానిపై వివరాలు సేకరించారు. అనంతరం ఉన్న సిబ్బందికి సచివాలయ విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. వలంటీర్లు ఎంత మంది ఉన్నది, వారిపై జవాబుదారీతనం ఎవరు నిర్వహిస్తున్నారు, సంక్షేమ పథకాలు అర్హుల, అనర్హుల జాబితాల ప్రదర్శన, ఎందుకు అనర్హులు అనే వివరాలతో ప్రదర్శించింది లేనిది పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే ఎంత వరకు చేసింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ముదినేపల్లి రూరల్ : ఎలాంటి ఆర్థిక ఆసారా లేని వ్యక్తి మరణించగా అంత్యక్రియలకు వైద్యవిద్యార్థిని సోమవారం ఆర్థిక సాయం అందజేసింది. ముదినేపల్లికి చెందిన వడ్లమూడి శివ మరణించారు. ఇతనికి తల్లిదండ్రులు లేరు. ఒక సోదరుడు ఉన్నాడు. పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో సమాచారం తెలుసుకున్న స్థానిక వైద్యుడు అంబుల మనోజ్ కుమార్తె వైద్య విద్యార్థిని అయిన వైష్ణవి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేసింది.

వెండి తమలపాకులు సమర్పణ



ముదినేపల్లి రూరల్ : మండలంలోని వణుదుర్రు శివారు కొత్తపల్లి సెంటర్లో ఉన్న శ్రీదాసాంజనేయస్వామికి దాత సోమవారం వెండి తమలపాకులు సమర్పించారు. హనుమజ్జయంతి సందర్భంగా ఆలయంలో స్వామివారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గుడివాడకు చెందిన కొండపల్లి కిరణ్‌కుమార్ దంపతులు స్వామికి వెండితో తయారుచేసిన తమలపాకులను విగ్రహానికి అలంకరించారు. దాతను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

వార్డు వలంటీర్లకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని వివిధ వార్డుల్లో ఏర్పడిన వలంటీర్ పోస్టుల ఖాళీలు భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆమోదం తెలిపారని మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువత ఈనెల 16వ తేదీ లోగా వార్డు వలంటీర్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని సచివాలయాలను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

వానపాముల (పెదపారుపూడి): మండలంలోని వానపాముల ఎస్సీ కాలనీలో సుమారు రూ. 12 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఎంపీపీ గోగం సురేష్, సర్పంచ్ పాతూరి రమేష్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో రోడ్ల సమస్యను ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ దృష్టికి తీసుకుని వెళ్లాగా, వెంటనే స్పందించి సీఎండీఎఫ్ నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం. నాగిరెడ్డి, జమీదింటకుర్రు సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు మెండెం ఎలీయా, పడాలి రామారావు పాల్గొన్నారు.

కైకలూరు పట్టణ సీఐగా రఘు



కై కలూరు: పట్టణ సీఐగా ఆకుల రఘు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన భీమవరం సీసీఎస్ సీఐగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కై కలూరు వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఎంవీఎస్ నాగరాజు ఏలూరు ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతన సీఐ రఘు ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

మంగళసూత్రం బహూకరణ



ఐనంపూడి(పామర్రు): ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు గ్రామంలో వివాహం చేసుకునే ప్రతి కుటుంబానికి బంగారు మంగళ సూత్రం ఇస్తున్నట్లు గ్రామసర్పంచ్ భట్టు పరం జ్యోతి అన్నారు. మండల పరిధి ఐనంపూడి గ్రామంలో వివాహ కర్తలకు సోమవారం మంగళసూత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భట్టు వీర రాఘవులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



గుడివాడ టౌన్: బేతవోలులో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ ఆనందేశ్వరి స్వామి వారి కల్యాణ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గ చైర్మన్ ఎస్‌వీ సీతారామాంజనేయ దాస్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ స్వామి వారి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా సోమవారం స్వామి వారి అభిషేకాలు, ప్రత్యేక పూజలతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభించామన్నారు. బుధవారం రాత్రి కల్యాణం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆలయ ఈఓ ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో సరదాగా విద్యార్థులు



ముదినేపల్లి రూరల్ : ఎల్లప్పుడూ తరగతి గదుల్లో పాఠ్యాంశాలతో కుస్తీపట్టే విద్యార్థులకు వేసవి సెలవులు ఆహ్లాదంగా, విజ్ఞానపరంగా మారేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ శిబిరాల్లో విద్యార్థులకు మానసికోల్లాసంతో పాటు విజ్ఞానం పెంచే అనేక అంశాలను బోధిస్తున్నారు. పలు ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలను ఇతర మెటీరియల్స్ అందజేశారు. వీటి ద్వారా విద్యార్థులు పరిణితి సాధించేందుకు అవకాశం ఏర్పడుతోందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

కూచిపూడి బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి, కన్వీనర్ కోటేశ్వరరావు

కూచిపూడి(మొవ్వ): మండు టెండల్లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయటం అభినందనీయమైందని కూచిపూడి గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మొవ్వ మండలం కూచిపూడి బస్టాండ్‌లో మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్, మానవత సేవా సంస్థ కేంద్ర నియంత్రణ కమిటీ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. తొలి రోజు ప్రయాణికులకు, గ్రామస్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం పిట్టు శ్రీనివాసరావు అధ్యక్షతన నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సేవా సంస్థ కార్యదర్శి బి. సత్యనారాయణ, ట్రెజరర్ టి. మోహనరావు, నాయకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



తోట్లవల్లూరులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్

తోట్లవల్లూరు: వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరాలను అవ్వా, తాతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైఎస్సార్ కంటి వెలుగు వైద్యశిబిరం(ఫేజ్–3) సోమవారం జరిగింది. నేత్ర సమస్యలు ఉన్న 60 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు కంటి శిబిరాలను వినియోగించుకోవాలని రాజామణి కోరారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ అవ్వాతాతలకు కంటి పరీక్షలను నిర్వహించారు. మండల వ్యాప్తంగా జూన్ 30 వరకు అన్ని గ్రామాలలో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతోపాటు కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని రాజేష్ కుమార్ తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న, సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, ఆరోగ్య సిబ్బంది పద్మావతి, రోహిణి, కమలాక్షి, కిరణ్‌కుమారి, శివరామకృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పామర్రు అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలను నాటుతున్న సూపర్‌వైజర్ విజయకుమారి

పామర్రు: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతగా గుర్తించాలని పామర్రు ప్రాజెక్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. స్థానిక బాపూజీపేటలోని అంగన్ వాడీ కేంద్రంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణాన్ని కలుషితం కాకుండా ప్రజలలో మార్పు తేవాలన్నారు. పరిశ్రమల వల్ల వచ్చే వ్యర్థాలు, చెట్లను నరకివేయుడం వల్ల వాతావరణంలో మార్పులు వస్తున్నాయని అన్నారు. చెట్లను పెంచడంతోపాటు విద్యుత్‌ని ఆదా చేయటం, నీరు వృథా తగ్గించడం, ప్లాస్టిక్‌ని పూర్తిగా వాడటం మానేయాలన్నారు.

యజ్ఞానికి తరలిన భక్తులు



బస్సులో యజ్ఞానికి తరలివెళుతున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: లోకకల్యాణార్థం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీమహాయజ్ఞానికి మండలం నుంచి పలువురు భక్తులు సోమవారం ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు. ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరింది. ఈ సందర్భంగా ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ సుబ్బారాయుడికి ప్రత్యేక పూజలు చేసి జెండా ఊపి యాత్ర బస్సును ప్రారంభించారు. ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు ఆనందదాసు శివనాగేంద్ర, మరడాని గాంధీ, ఉప్పలపాటి మంగతాయారు, భట్రాజు నాగమల్లేశ్వరమ్మ, చింతగుంట నాగలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు. సహాయ కమిషనర్ సంధ్య మాట్లాడుతూ యజ్ఞం ప్రాధాన్యతను భక్తులకు తెలియజెప్పేందుకు ప్రత్యేక బస్సులో తరలివెళుతున్నామన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో చేరండి



ప్రైవేటు పాఠశాల విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ ఇచ్చిన హెచ్ఎం రమాదేవి

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలో బడి ఈడు గల పిల్లలను బడిలో చేర్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మొవ్వ మండలం కాజ గ్రామంలో పీఎస్ఆర్ ప్రభుత్వ జెడ్పీ పాఠశాల హెచ్ఎం బి. రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందిస్తున్న అమ్మ ఒడి, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు తదితర సంక్షేమాలను వివరించారు. అలాగే పాఠశాలలో 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత, అత్యుత్తమ బోధనా విధానం, అందిస్తున్న స్కాలర్ షిప్‌లు, ఆటల పోటీల్లో విద్యార్థులు సాధించిన విజయాలను వివరించి పేర్లు నమోదు చేసుకున్నారు.

వారం రోజుల పాటు జరగనున్న ఈ డ్రైవ్‌లో తొలి రోజు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులను కాజ జెడ్పీ పాఠశాలలో జాయిన్ చేయించినట్లు హెచ్ఎం రమాదేవి తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు కె. అరుణ, సుధారాణి, ఎంఎస్ఆర్ లక్ష్మి, పి. సుగుణ, వీవీ పిచ్చేశ్వరరావు, ఎస్. ఫణి ప్రశాంతి, జాన్సన్, విఠల్ ప్రసాద్, కేవీవీ నరసింహారావు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



ముదినేపల్లిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఐ షణ్ముఖసాయి

ముదినేపల్లి రూరల్ : స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం పలువురి దాహార్తి తీరుస్తోంది. జనసంచారం అధికంగా ఉండే పోలీసుస్టేషన్ సమీపంలోనే ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులతో పాటు ఇతర ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్ర ఎంతగానో ఉపయోగపడుతోంది. ఎస్ఐ షణ్ముఖసాయి సూచనల మేరకు సిబ్బంది సొంత వ్యయంతో ప్రతిరోజూ మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. వేసవి ముగిసే వరకు ఈ శిబిరాన్ని కొనసాగిస్తామని ఎస్ఐ తెలిపారు.

తృప్తిగా జీవించడం నేర్చుకోండి

బిషప్ రాజారావు



క్రీస్తు సందేశం ఇస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు

అవనిగడ్డ: నిత్య తృప్తితో మనిషి జీవించినపుడే సంతోషంగా ఉంటారని విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. స్థానిక కోటగిరిలంకలోని తిరుకుటుంబ విచారణ (ఆర్‌సీఎం) వార్షికోత్సవ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బిషప్ జోసఫ్ రాజారావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు యెడల విశ్వాసం, నమ్మిక, ప్రేమ కలిగి ఉన్నపుడే సంతోషంగా ఉంటారన్నారు. పవిత్రాత్మ దేవుడు ఉన్నచోట ప్రేమ ఉంటుందని, ప్రేమ లేకపోతే మనిషి జీవితం వ్యర్థమన్నారు. ప్రతి క్రైస్తవ విశ్వాసి తమ హృదయంలో క్రీస్తుని పవిత్రునిగా ప్రతిష్టించుకోవాలని కోరారు. ప్రభువు ఆజ్ఞలు స్వీకరించి ఆచరించినపుడు నిత్య జీవితంలో ఎంతో సంతోషంగా ఉంటారని చెప్పారు. విశ్వాసులు తోటి వారిపట్ల ప్రేమ, జాలి, దయ, సహాయత కలిగి ఉండాలన్నారు. జ్ఞానస్నానం ద్వారా క్రైస్తవులు అవుతారని, దీనిద్వారా పాపాలు పరిహారం అవుతాయన్నారు. 180 మంది చిన్నారులు, విశ్వాసులకు బిషప్ జోసఫ్ రాజారావు ధ్రువీకరణ అభ్యంగనం ఇచ్చారు. తొలుత సిలువ గుహ నుంచి ఆర్‌సీఎం చర్చి వరకూ బిషప్‌కి పూలు చల్లుతూ ఘనంగా తీసుకొచ్చారు. అనంతరం విశ్వాసులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువు సురేష్ మెర్లో పాల్గొన్నారు.